క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

పలిమెల: ఈ ఏడాది జూన్ 28లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, గతంలో రైతు బీమా చేసుకొని రైతులు ఈనెల 30వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దరఖాస్తు ఫారంతో పాటు కొత్తగా వచ్చిన పట్టా పాస్ పుస్తకం, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జతచేసి వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాలని తెలిపారు.

సీత్లాభవాని వేడుకలు

మహాముత్తారం: మండలంలోని ప్రేమ్‌నగర్ గ్రామానికి చెందిన లంబాడీలు మంగళవారం సీత్లాభవాని వేడుకలను నిర్వహించారు. గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్లి సీత్లాభవానికి సాంప్రదాయ నైవేద్యం పూజలు నిర్వహించి ఆటాపాటలతో నృత్యాలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

రుణమాఫీ గ్రీవెన్స్ ఏర్పాటు

మహాముత్తారం: రుణమాఫీపై రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా తెలుపుటకు రైతువేదికల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీపై ఏమైన సందేహాలు ఉంటే ఆధార్‌కార్డు తీసుకుని గ్రామంలోని మీ పరిధిలోని రైతువేదికల్లో ఏఈఓల వద్ద వివరాలు తీసుకోవాలన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



రేగొండ: హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఎస్సై రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘం ఉపాధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ.. సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకి మండలంలోని ఫొటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యాక్రమంలో మండల ఫొటోగ్రాపర్లు శంకర్, సురేందర్, రఘుపతి, రాకేష్, వెంకటేష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'స్మితా సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలి'

కాటారం: దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాచర్ల వంశీకృష్ణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల రిజర్వేషన్ ఎందుకు అంటూ ట్విట్టర్‌లో దివ్యాంగులను అవమానపర్చేలా సిత్మా సబర్వాల్ వెకిలిరాతలు రాయడం సరికాదన్నారు. ఒక గౌరవప్రదమైన ఐఏఎస్ స్థానంలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని ఆమె వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పి వ్యాఖ్యలనె వెనక్కి తీసుకోవాలని అన్నారు. దివ్యాంగుల చట్టం 2016 యాక్ట్ ప్రకారం స్మితా సబర్వాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్డీఓ వాహనం

- ఇద్దరి పరిస్థితి విషమం





గణపురం: గణపురం మండలంలోని చెల్పూరు శివారు కొంపల్లి క్రాస్ వద్ద మంగళవారం భూపాలపల్లి ఆర్డీఓ మంగీలాల్ వాహనం.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షుల కథనం ప్రకారం.. గాంధీనగర్ నుంచి భూపాలపల్లి వైపునకు వెళ్తున్న ఆర్డీఓ వాహనం కొంపల్లి క్రాస్ వద్ద అతివేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పుల్లురామయ్యపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సంపత్, కొంపల్లి గ్రామానికి గుండాల ఎల్లయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

బురదలో ఇరుక్కున్న క్రేన్

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి వద్ద ఐరన్‌బ్రిడ్జిని అమర్చేందుకు వచ్చిన క్రేన్ ఊరట్టం మేడారం వైపు వెళ్లే కొండ్రేడు వద్ద మంగళవారం బురదలో ఇరుక్కుపోయింది. కొండాయి వద్ద పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను నిలిపివేశారు. దీంతో చేసేది ఏమిలేక క్రేన్‌ను వెనక్కు పంపించి వేస్తున్నారు. దీంతో వెళ్తున్న క్రమంలో దిగబడడంతో క్రేన్‌ను బయటకు తీసేందుకు నరకయానత పడ్డారు. అంతే కాకుండా రోడ్డుకు అడ్డుగా ఉండడంతో మరింత ఇబ్బందులు ఎదురయ్యాయి.

మృత్యు మలుపులు



రేగొండ నుంచి జగ్గయ్యపేట గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా మలుపు



మలుపు వద్ద ప్రమాదకరంగా బావి(ఇన్‌సెట్‌లో)

ప్రమాదకరంగా రహదారులు

- మలుపుల వద్ద లేని సూచికబోర్డులు
- పట్టించుకోని అధికారులు

రేగొండ: సమాజంలో నిత్యం జరుగుతున్న రోడ్డుప్రమాదాలు ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తులు తిరిగి క్షేమంగా వస్తారనే నమ్మకం ప్రస్తుతం సన్నగిల్లుతోంది. ఆయా గ్రామాలకు వెళ్లె అంతర్గత రహదారుల మధ్యలో ఉన్న మలుపులు వాహనదారుల పాలిట యమగండంగా మారుతున్నాయి. ఉమ్మడి రేగొండ మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లోని ఆయా గ్రామాల్లో అత్యంత ప్రమాదకరంగా మలుపులు ఉండటంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మలుపుల వద్ద పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని గ్రామ పంచాయతీల్లోని ఆయా గ్రామాలకు వెళ్లే దారిలో గల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధానంగా రేగొండ మండల కేంద్రం నుంచి జగ్గయ్యపేటకు వెళ్లే దారిలో చెరువు వద్ద, కోటంచ నుంచి గూడెపల్లి, పోచంపల్లి నుంచి దుంపిల్లపల్లి, రాయపల్లె నుంచి కనిపర్తి, రంగయ్యపల్లి నుంచి పోచంపల్లి, వెంకటేశ్వర్లపల్లి నుంచి కొనరావుపేట, నిజాంపల్లి నుంచి గాంధీనగర్, బాలయ్యపల్లె నుంచి చిన్నకోడెపాక వెళ్లే దారుల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి.

రక్షణ చర్యలు కరువు

ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరిగిడంతో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడుతున్నారు. మలుపులకు ఆనుకోని చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. దీనికి తోడు మరికొన్ని చోట్ల మలుపులు ఉన్న ప్రాంతంలో రహదారికి ఆనుకోని వ్యవసాయ బావులు ఉన్నాయి. అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రా ణ నష్టం పెద్ద ఎత్తున జరిగే అస్కారం ఉంది. ప్రమాదకర మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలను నిర్మించడం గాని చేయడం లేదు. గతంలో రేగొండ నుంచి జగ్గయ్యపేట వెళ్లే దారిలో మలుపు మూలంగా రెండు నిండు ప్రాణాలు బలికాగా, ఒ కరికి తీవ్ర గాయాలయ్యాయి. రేగొండ నుంచి చిట్యాల వెళ్లే దారిలో రంగయ్యపల్లి వద్ద బా విలో చల్లగరిగ గ్రామానికి చెందిన వ్యక్తి పడి ప్రాణాలు కోల్పోయాడు. మలుపుల వద్ద తరు చూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ తీవ్ర గాయాలపాలవుతున్నారు. దీంతో క్షతగాత్రుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అధికారులు ఇప్పటికైన స్పందించి మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డుల ఏక పోవడంతో వేగం ఎక్కువగా ఉన్న వాహనాలు ఈ ప్రాంతానికి రాగానే వేగాన్ని నియంత్రించుకోలేక చెట్లను, విద్యుత్ స్తంభాలను ఢీ కొని మృతి చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

\- పెండ్యాల రాజు, రేగొండ

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టాలి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లముళ్ల పొదలు పెరిగాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఇప్పటికై నా అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి, మరమ్మతులు చేపట్టాలి.

\- పల్లెబోయిన తిరుపతి, కొత్తపల్లిగోరి

సెల్‌ఫోన్లు దొరికితే అప్పగించాలి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లతో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సైలు

కాటారం: ఎవరికైనా ఇతరుల సెల్‌ఫోన్లు దొరికితే అందుబాటులో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాటారం సబ్‌డివిజన్ పరిధిలో సెల్‌ఫోన్లు పొగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ సాంకేతికను ఉపయోగించి 29 సెల్‌ఫోన్లను సేకరించి వారికి అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు ఒరిజినల్ బిల్లు, ఆధార్‌కార్డు, పోగొట్టుకున్న తేదీ, వివరాలతో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కానీ ఆన్‌లైన్ సెంటర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రత్యేక సాంకేతికను ఉపయోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైన సెకెండ్ హ్యాండ్ మొబైల్స్ కొనుగోలు చేసినట్లయితే వాటికి సంబంధించిన ఒరిజినల్ బిల్లు, బాక్స్ ఉంటేనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. మొబైల్‌షాప్ యజమానుల దగ్గరికి ఎవరైన సెల్‌ఫోన్‌లు అన్‌లాక్ చేయమని వస్తే ఒరిజినల్ బిల్లు, బాక్స్ ఉంటేనే అన్‌లాక్ చేయాలని అవి లేకుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. బాధితులు పోగొట్టుకున్న ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ సాంకేతికతను ఉపయోగించి సేకరించిన కానిస్టేబుల్స్ ధనుంజయ్, ఐటీ కోర్ కానిస్టేబుల్ వేణు, ఆయా పోలీస్‌స్టేషన్‌ల పోర్టల్ ఇన్‌చార్జ్‌లు స్వాతి, సింధు, శిరీష, మాషుక్, రమేశ్, అరుణ్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సైలు మ్యాక అభినవ్, మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ పీపీగా శివకుమార్



శివకుమార్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

మల్హర్: ప్రిన్స్‌పాల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భూపాలపల్లి కోర్టు అసిస్టెంట్ పీపీగా మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టరెట్ సూపరిటెండెంట్ శ్రీనివాస్ మంగళవారం శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది, పీసీసీ సభ్యుడు చల్లూరి మధకు కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రవీందర్‌గౌడ్

టేకుమట్ల: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పంగిడిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం గీతా కార్మికుడు మాచర్ల రవీందర్‌గౌడ్ రోజువారిలాగే తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో చెతికి తీవ్ర గాయాలై విరిగినట్లు తెలిపారు. కాగా చికిత్స కోసం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, రవీందర్‌గౌడ్ చేయి విరగడంతో ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఉపాధ్యాయుల అభ్యర్థనల పరిశీలన



ఉపాధ్యాయుల అభ్యర్థనను పరిశీలిస్తున్న డీఈఓ

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీఓ 317లోని ఉపాధ్యాయుల అభ్యర్థనలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలన ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అభ్యర్థనల పరిశీలన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికత ఆధారిత కేటగిరి, భార్యాభర్తల (స్పౌస్) కేటగిరీ, దివ్యాంగుల కేటగిరీ, వైద్య ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రతీ మండలానికి ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, ఒక సహాయక ఉపాధ్యాయుడిని నియమించి మండలాల వారీగా జీఓ 317లోని ఉపాధ్యాయుల అభ్యర్థనలను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు దేవా, ప్రభాకర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, ఏఎంఓ కాగిత లక్ష్మణ్, సీఎంఓ సామల రమేష్, జీసీడీఓ శైలజ, ఏఎస్‌ఓ రామకృష్ణ, ఏసీజీఈ మండల రవీందర్‌రెడ్డి, సిబ్బంది సమ్మయ్య, శనిగరపు భద్రయ్య, కృష్ణమోహన్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల ఆకస్మిక తనిఖీ



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ నారాయణరావు

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని రంగయ్యపల్లి, జగ్గయ్యపేట గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నిల్వ నీటిని తొలగించడంతో పాటు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులు తగ్గిన తరువాత అన్ని గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు.

బ్రిడ్జి పనులు వేగవంతంగా చేపట్టాలి

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద ఏర్పాటుచేసిన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేసిన రోడ్డును మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు పరిశీలించారు. బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ రాంప్రసాద రావు, పంచాయతీ కార్యదర్శులు గోపాలక్రిష్ణ, స్రవంతి, జీవిత ఉన్నారు.

నేడు వాహనాల వేలం

కాటారం: కాటారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను కార్యాలయ ఆవరణలో నేడు(బుధవారం) వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్, ఎస్సై కిష్టయ్య మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణయించిన వాహనం ధరలో 50శాతం సొమ్ము ముందస్తుగా మిగితా సొమ్ము అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్క్రాప్ వాహనాలను కట్ చేసి తీసుకోవాలని వేలంలో వాహనం దక్కించుకున్న వారు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

తగ్గుతున్న గోదావరి వరద



పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి వరద

వాజేడు: మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రం 7 గంటలకు 17.30 మీటర్లకు చేరుకున్న గోదావరి వరద మంగళవారం సాయంత్రానికి 16.10 మీటర్ల మేర తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు తగ్గడంతో గోదావరి వరద వేగంగా తగ్గుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. నాగారం, గుమ్మడిదొడ్డి పునరావాస కేంద్రాల్లో ఉన్న 29 మంది నిర్వాసితులను గోదావరి వరద తగ్గుతుండటంతో అధికారులు వైద్య పరీక్షలను నిర్వహించి ఇళ్లకు పంపించారు.

బీసీ కులగణన చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భూపాలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని తెలిపినట్లు పేర్కొన్నారు. అలాగే గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రూ.రెండు లక్షలను అకౌంట్లోకి వేస్తామని హామీ ఇచ్చి వారిని మోసం చేశారన్నారు. పార్టీ నాయకులు కంబాల రాజయ్య, మాచనివేని రవీందర్, కంచం నరసింహమూర్తి, శంకర్, తోటబదెలు, కరివేద మనోహర్, పొన్నం శ్రీను, వట్టం తిరుపతి, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కాటారం: నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

కాటారం: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిని డాక్టర్ మౌనిక సూచించారు. మండలంలోని దామెరకుంట సబ్‌సెంటర్ పరిధిలో గల గంగపురి, మల్లారం గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు దోమలు వ్యాపించకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబులాంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తిరుపతిరెడ్డి, సూపర్‌వైజర్ సరళ, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాణి

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

మొగుళ్లపల్లి: కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యాధికారిని వాణి అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో మంగళవారం మొగుళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాణి ఆదేశానుసారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరాలు వచ్చినట్లయితే, వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని మురికి కుంటలను, నీరు నిలువ ఉన్న ప్రదేశాలను గుర్తించి ఎఎల్‌ఓ మందును నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో చల్లించారు. గ్రామంలో 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఇద్దరి రక్త నమూనాలు తీసి ల్యాబ్ పంపించారు. ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఆఫీసర్ మల్లయ్య, సూపర్ వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఎఎన్‌ఎమ్ షబిద, పంచాయతీ కార్యదర్శి సుమత, ఆశవర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'చుక్క నీరివ్వని చరిత్ర బీఆర్‌ఎస్‌ది'



కాటారం: మాట్లాడుతున్న రాజు

కాటారం: మంథని ప్రాంతంలో భారీ ప్రాజెక్ట్ కట్టి నీరు, ఇసుక దోచుకుపోయి ఇక్కడి ప్రజలకు చుక్క నీరు కూడా ఇవ్వని చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకులది అని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్ట్ కృంగిపోయి అస్తవ్యస్తంగా ఉంటే అలాంటిది ఏమి లేదని కాంగ్రెస్ నాయకులు నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అనడం హాస్యాస్పదకం అన్నారు. ప్రాజెక్ట్ పేరిట టీఆర్‌ఎస్ నాయకులు కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కుమ్మరి అశోక్, డొంగిరి చిరంజీవి,డొంగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ పదిలమనడం హాస్యాస్పదం'

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ పదిలమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడడం హాస్యాస్పదమని మహదేవపూర్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలని కాళేశ్వరం బరాజ్‌లు, పంపుహౌస్‌ల్లో ఎక్కడా నాణ్యత పాటించలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులపై వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు.

పెట్రోల్ పోసుకుని గృహిణి ఆత్మహత్య

- మంటలు అంటుకుని గాయాలపాలైన మృతురాలి కుమారుడు



పావని(ఫైల్)



గాయాలపాలైన బాబు

టేకుమట్ల: గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పంగిడిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన పావని(28) 2018లో మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన గూడెపు దేవేందర్‌రెడ్డిని వివాహం చేసుకుంది. పావనికి కొన్ని రోజులుగా అత్తామామతో గొడవల కారణంగా ఇంట్లో ఉన్న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కాగా, చికిత్స కోసం ఆమె కుటుంబ సభ్యులు 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలంలో రెండున్నరేళ్ల తన కొడుకుకు ఉండగా బాబుకు సైతం మంటలు అంటుకోగా గాయాలపాలయ్యాడు. బాబును ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. పావని ఆత్మహత్య సంఘటనపై ఎస్సై ప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. మంగళవారం ప్రధాన రహదారిపై వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్సు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఆయన వెంట పోలీసులు ఉన్నారు.